RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం

PRABHATA GAMANAM

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 229 | సంపుటి 4 | శుక్రవారం | 08-05-2026 | పేజీలు 4 | వెల 3/-



04

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రెండేళ్లలోనే రూ. 21వేల కోట్ల రుణమాఫీ
- ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన లాభాలు
- మెగా రైతు మేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లండి :మంత్రి కొండా సురేఖ
- హన్మకొండలో మూడు రోజుల రాష్ట్రస్థాయి రైతు ఉత్సవాల ముగింపు
- 5వేల మంది రైతులకు ఆధునిక యంత్ర పరికరాలు, సాగు పద్ధతులపై శిక్షణ
- ఆదర్శ రైతులకు సన్మానం,
- ఆయిల్ పామ్ రైతులకు చెక్కుల పంపిణీ





04

## ఈనెల 20లోగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పూర్తి చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాలకు తావులేదు
- అర్హులైన పేదలకే అవకాశం
- బిల్లులను సకాలంలో విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశం
- లక్ష దాటిన జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్ల నియామకం
- రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూవివాదాలపై ఉమ్మడి సర్వేకు నిర్ణయం
- గతంలో సేకరించిన భూముల్లో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- సమీక్షసమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




## కేసముద్రం అభివృద్ధిపై

# నీలి నీడలు

- నిధులు వచ్చినా పనులు కొనసాగని దుస్థితి
- వేం సహకారంతో మండలానికి లక్షలాది గ్రాంట్స్
- నిధులను సద్వినియోగం చేయడంలో నిర్లక్ష్యం
- నత్తనడకన కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ఆ మొద్దునిద్ర వీడకపోతే విమర్శలపాలవ్వక తప్పదా..?

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రం అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పెద్దన్నగా పేరుగాంచి సీఎం సలహాదారుగా ఉండి, ఇటీవలే రాజ్యసభలో అడుగుమోపిన వేం నరేందర్ రెడ్డి స్వస్థలం కేసముద్రం. తాను పుట్టిపెరిగిన గడ్డను అభివృద్ధి చేసుకోవాలన్న తపనతో లక్షలాది రూపాయలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. రహదారుల విస్తరణ, ఆస్పత్రి విస్తరణ, కాలేజీలు, సెంట్రల్ లైటింగ్, మార్కెట్ అభివృద్ధి, కాలేజీలు మంజూరు తదితర పనుల నిమ్మిత్తం వెయ్యి కోట్లకు పైగా గ్రాంట్స్ తెప్పించారు. అయితే వీటిని సద్వినియోగం చేయడంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెనకబడుతున్నారు. వచ్చిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించినా.. వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అభివృద్ధి చేయాల్సిన పనులపై నీలినీడలు కమ్ముకోవడంతో.. పనులు నెమ్మదిగా సాగుతున్నాయన్న విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

— హైదరాబాద్, ప్రభాత గమనం

2

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బీజేపీ శ్రేణుల దాడికి యత్నం
- గంగుల క్యాంపు కార్యాలయంలో ఫర్నీచర్, కారు ధ్వంసం
- బండి సంజయ్ పై కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో భగ్గుమన్న కమల దళం
- రంగంలోకి పోలీసులు.. ఇరువర్గాలను చెదరగొట్టి కౌశిక్ రెడ్డిని అదుపులోకి

- మహిళా సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం
- వడ్డీ భారం మొత్తం ప్రభుత్వానిదే
- ఈ ఏడాది రుణాల వడ్డీ కోసం రూ. 2,500 కోట్ల కేటాయింపు
- పేదరికం పోవాలనే నాటి పోరాటం.. నేడు వడ్డీలేని రుణాలు
- నిర్మల్ జిల్లా మాదిరిగా 100%రీపేమెంట్ సాధించాలి
- మంత్రి సీతక్క స్పష్టీకరణ

## రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణం

## కరీంనగర్‌లో రాజకీయ రణరంగం



04



04

# కేసముద్రం అభివృద్ధిపై నీలి నీడలు

- నిధులు వచ్చినా పనులు కొనసాగని దుస్థితి
- వేం సహకారంతో మండలానికి లక్షలాది గ్రాంట్స్
- నిధులను సద్వినియోగం చేయడంలో నిర్లక్ష్యం
- నత్తనడకన కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ఆ మొద్దునిద్ర వీడకపోతే విమర్శలపాలవ్వక తప్పదా..?



**హైదరాబాద్, ప్రభాత గమనం:**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రం అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పెద్దన్నగా పేరుగాంచి సీఎం సలహాదారుగా ఉండి, ఇటీవలే రాజ్యసభలో అడుగుమోపిన వేం నరేందర్ రెడ్డి స్వస్థలం కేసముద్రం. తాను పుట్టిపెరిగిన గడ్డను అభివృద్ధి చేసుకోవాలన్న తపనతో లక్షలాది రూపాయలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. రహదారుల విస్తరణ, ఆస్పత్రి విస్తరణ, కాలేజీలు, సెంట్రల్ లైటింగ్, మార్కెట్ అభివృద్ధి, కాలేజీలు మంజూరు తదితర పనుల నిమ్మిత్తం వెయ్యి కోట్లకు పైగా గ్రాంట్స్ తెప్పించారు. అయితే వీటిని సద్వినియోగం చేయడంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెనకబడుతున్నారు. వచ్చిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించినా.. వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అభివృద్ధి చేయాల్సిన పనులపై నీలినీడలు కమ్ముకోవడంతో.. పనులు నెమ్మదిగా సాగుతున్నాయన్న విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

## కాలేజీల నిర్మాణాల్లో ఇదే వైఖరి

కేసముద్రం మండల కేంద్రంలోని చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన విద్యను అందించాలని, పేదబిడ్డలు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడొద్దని మండలానికి ఓ పాలిటెక్నిక్ కాలేజీ, డిగ్రీ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే.. ఈ కాలేజీల భవన నిర్మాణాల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీని కారణంగా విద్యార్థులు అడ్మిషన్లు చేసుకోలేని దుస్థితి. నిర్మాణాలకు టెండర్లు ఖరారైనా కాంట్రాక్టర్ల నిర్లప్తత కారణంగా కాలేజీల భవనాలు నిర్మాణ పనులు మొదలపెట్టలేదు.

## ఆధ్యాత్మికతపై నిర్లక్ష్యం

మండల కేంద్రంలోని పలు దేవాలయాల అభివృద్ధికి, మౌలిక మరమ్మత్తుల కోసం కూడా నిధులు కేటాయించిందట సర్కార్. వీటి వాటి వినియోగంపై కూడా నేటికి స్పష్టత లేకపోవడం గమనార్హం. కనీసం ఆలయాలకు వినియోగించాల్సిన నిధులను కూడా సద్వినియోగం చేయకపోతే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు స్థానిక ప్రజలు. వెంటనే దేవాలయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

## వేం ఆశలపల్లకి కేసముద్రం

రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ఆశలపల్లకి కేసముద్రం. అలాంటి కేసముద్రం అభివృద్ధిపై స్థానిక న్యాయకత్వం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా పనుల్లో అలసత్వం వహిస్తున్నారు. అధికార వర్గాలు నిర్లక్ష్యంగా ఉంటే అధికార పరపతిని వినియోగించి ఆఫీసర్లను ఉరుకులు పరుగులు పెట్టించాల్సిన స్థానిక నాయకత్వం ఎందుకో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వేం నరేందర్ రెడ్డి అభివృద్ధిపై ఆసక్తి చూపుతున్నప్పటికీ, సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వడం లేదు.

## మొద్దునిద్ర వీడితేనే మేల్కొలుపు

అటు అధికారులు కానీ, అధికారవర్గ నాయకులు కానీ మొద్దునిద్ర వీడి మేల్కొంటేనే మండల కేంద్రం అభివృద్ధిని సాధించగలదు. పెండింగ్ పనులపై ఫోకస్ చేసి త్వరితగతిన పూర్తి చేస్తేనే మండల కేంద్ర ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. వచ్చిన నిధులను కూడా సకాలంలో సద్వినియోగం చేసుకోకపోతే ఎక్కడి గొంగలి అక్కడే అన్నచందంగా.. తొవ్వి ఉన్న రోడ్లు నాయకుల డొల్లతనాన్ని బయటపెడుతూనే ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న కాలేజీల నిర్మాణాలు అధికారుల నిర్లప్తతను ఎత్తిచూపిస్తూనే ఉంటాయి. సెంట్రల్ లైంటింగ్ పెండింగ్ పనులు నేతల కళ్లలో అసమర్థత మిరిమిట్లు కురిపిస్తూనే ఉంటుంది.

### రోడ్ల విస్తరణ, లైటింగ్ పనుల్లో నిర్లక్ష్యం

**ప్రధానంగా కేసముద్రం పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సంకల్పించి లక్షలాది రూపాయలు ఈ ప్రాజెక్టు కింద మంజూరైతే వాటిని బుడిదలో పోసిన పన్నీరులా చేస్తున్నారు అధికారులు. నేటికి సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. మరోవైపు రోడ్ల విస్తరణ పనులది కూడా ఇదే తంతూ. మండల కేంద్రంలో రహదారుల విస్తరణ కోసం రోడ్డు వెడల్పు పనులు ఆలస్యం అవుతున్నాయి. అధికారుల మధ్య సమన్వయలోపం, అభి వృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించడం మూలంగానే నేటికి రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయలేదు. దీంతో.. మండల కేంద్రంలో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. ట్రాఫిక్ సమస్య తీవ్రమవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.**




# నెహ్రూ సెంటర్‌లో చలివేంద్రం 'ఉత్తుత్తిదే'..

- నీళ్లు లేక బాటసారుల విలవిల
- ఆర్భాటంగా ప్రారంభించి, నిర్వహణ వదిలేసిన పంచాయతీ
- తాగునీరు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్

**గార్ల, మే 07 (ప్రభాత గమనం) :**

ఎండలు మండిపోతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చాల్సిన చలివేంద్రాలు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా మారుతున్నాయి. గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్లో మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతోంది.ప్రజల సౌకర్యార్థం పంచాయతీ నిధులతో ఆర్భాటంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, అందులో నీరు పోసే నాథుడే కరువయ్యారు. చలివేంద్రం వద్దకు ఆశగా వస్తున్న ప్రయాణికులు, పాదచారులు ఖాళీ కుండలను చూసి నిట్టూరుస్తూ వెనుతిరుగుతున్నారు. "ప్రభుత్వ రికార్డుల్లో చలివేంద్రం నడుస్తున్నట్లు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం చుక్క నీరు కూడా అందుబాటులో లేదు. కనీసం తాగునీటి సౌకర్యం కల్పించలేని స్థితిలో పంచాయతీ ఉందా?" అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు నింపాల్సిన సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా మారిన చలివేంద్రం. మండుటెండలో నెహ్రూ సెంటర్ వంటి రద్దీ ప్రాంతంలో నీరు దొరక్క ప్రయాణికుల అవస్థ లు, వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి నిత్యం చలివేంద్రంలో నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఇప్పటికైనా స్పందించి, కేవలం ఫొటోల కోసం కాకుండా నిజంగా ప్రజల దాహం తీర్చేలా ఈ చలివేంద్రాన్ని నిర్వహించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# పెద్ద కిష్టాపురంలో అల్లూరి వర్ధంతి

- సీతారామరాజు విప్లవ స్ఫూర్తితోనే గిరిజనుల హక్కుల రక్షణ
- నివాళులర్పించిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

**గార్ల, మే 07 (ప్రభాత గమనం) :**

బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన మన్యంవీరుడు, విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనే లక్ష్యంగా నేటి తరం ముందుకు సాగాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జడ సత్యనారాయణ పిలుపునిచ్చారు.గురువారం గార్ల మండల పరిధిలోని పెద్ద కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రగతిశీల యువజన సంఘం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి విప్లవ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి గుగులోత్ సక్రు మాట్లాడుతూ.. అల్లూరి సేవలను కొనియాడారు. మన్యం ప్రాంత గిరిజనుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప గెరిల్లా నాయకుడు అల్లూరి అని శ్లాఘించారు. తన యవ్వనాన్ని, ప్రాణాన్ని దేశ స్వాతంత్ర్యం కోసం, అణగారిన వర్గాల విముక్తి కోసం తృణప్రాయంగా అర్పించిన ధీశాలి అని కొనియాడారు. నేటికీ గిరిజన ప్రాంతాల్లో భూమి, భుక్తి కోసం పోరాటాలు సాగుతున్నాయని, అల్లూరి చూపిన విప్లవ బాటలో పయనించి ఆశయాలను సిద్ధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ రాష్ట్ర నాయకులు ఇర్రి రవి, జిల్లా నాయకులు మంగీలాల్‌తో పాటు మండల స్థాయి నేతలు పాక వీరన్న, సంతోష్, సంజయ్, విజయ్, రాఘవ్, టి. వెంకన్న, వినోద్ మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలే

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్
- గంగారం పీహెచ్‌సీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**మహబూబాబాద్, మే 7 (ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC)లో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యులు, సిబ్బందిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో వైద్య సేవల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ గురువారం గంగారం PHCని సందర్శించి విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, సేవల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన స్థానిక వైద్యులకు సంబంధిత సిబ్బందికి డాక్టర్ రవి రాథోడ్ తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిర్ణీత సమయానికి విధుల్లో ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటించడంతో పాటు, మందుల లభ్యతపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎస్సీ యువతకు స్వయం ఉపాధిపై అవగాహన


**మహబూబాబాద్, మే07(ప్రభాత గమనం):**

జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం మహబూబాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షత జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 అమలుకు సంబంధించి లబ్ది దారుల ఎంపిక మరియు (గౌన్డింగ్ ప్రక్రియ లో భాగంగా జిల్లా మరియు మండల కమిటీ సభ్యులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై జిల్లా స్థాయి అధికారులకు, మండల స్థాయి అధికారులకు మరియు బ్యాంకర్లకు అవగాహన కల్పించారు. ఈ పథకం కింద రూ. లక్ష విలువ గల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు 90% సబ్సిడీతో అందించబడతాయని తెలిపారు. అలాగే రూ. 2.40 లక్షల విలువ గల పాడి గేదెలు, రూ.3 లక్షల విలువ గల గూడ్స్/ప్యాసింజర్ (త్రిచక్ర వాహనాలు 70% సబ్సిడీతో, రూ.3 నుండి 7 లక్షల విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ సెట్ యూనిట్లు 100% సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పథకాల ద్వారా యువతకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మండల కమిటీ ఆధ్వర్యంలో యూనిట్లకు అర్హులైన ఎస్సీ అభ్యర్థులను గుర్తించి త్వరితగతిన షెడ్యూల్ ప్రకారం గ్రౌండింగ్ చేయాలని సూచించారు. బ్యాంకులు వాటిని వేగంగా పరిశీలించి రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు శ్రీనివాసరావు,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ యాదగిరి, పరిశ్రమల అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, పశువైద్య శాఖ అధికారి కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గడ్డివాము పైనుంచి పడి రైతు మృతి..

- రూ. 40 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి : సీపీఐ

**గార్ల, మే 07 (ప్రభాత గమనం) :**



అకాల వర్షం, గాలివాన ఒక పేద రైతు కుటుంబాన్ని రోడ్డున పడేసింది. గాలి దుమారం కారణంగా గడ్డివాము పైనుంచి పడి గార్ల మండలం పుట్టకోట బజారుకు చెందిన సంపత్ అనే రైతు మృతి చెందడం స్థానికంగా విషాదం నింపింది. ఈ ఘటనపై సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల గార్ల మండల కేంద్రంలో పిడుగులతో కూడిన భారీ గాలివాన కురిసింది. ఈ క్రమంలో రైతు సంపత్ తన గడ్డివామును కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా, ఒక్కసారిగా వచ్చిన గాలి దుమారానికి ప్రమాదవశాత్తూ పైనుండి కిందపడ్డారు. తీవ్ర గాయాలైన ఆయనను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. సమాచారం అందుకున్న సీపీఐ గార్ల మండల సమితి నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కట్టెబోయిన శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న మాట్లాడుతూ.. సంపత్ మరణంతో ఆ కుటుంబం ఆధారాన్ని కోల్పోయిందని, పిల్లలు అనాథలుగా మారారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన రైతు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 40 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంపత్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

# మహిళల భద్రతపై అవగాహన

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా షీటీమ్ ఎస్ఐ సునంద ఆధ్వర్యంలో ఈరోజు మహబూబాబాద్ ధాన్యం మార్కెట్‌లో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది వ్యవసాయ మార్కెట్ కార్మికులు, రైతులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న వివక్ష, లింగ అసమానత, సెక్సిజం, మిసోజనీ, పితృస్వామ్య భావజాలం వల్ల కలిగే దుష్పరిణామాలపై షీటీమ్ సిబ్బంది ప్రజలకు వివరించారు. మహిళల భద్రత, గౌరవ రక్షణ కోసం అమల్లో ఉన్న ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, ఉద్యోగ స్థలాల్లో మహిళలపై వేధింపులు జరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే షీటీమ్ అంటే ఏమిటి, అది ఎలా పనిచేస్తుంది, మహిళలకు, బాలికలకు షీటీమ్ ద్వారా ఎలాంటి రక్షణ, సహాయం అందుతుందనే విషయాలను ప్రజలకు తెలియజేశారు. బాలలపై జరుగుతున్న లైంగిక దాడులు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం ప్రాముఖ్యత, బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు, యువత ప్రేమ పేరుతో మోసపోవడం, ఎలోపింగ్ వంటి సంఘటనలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 1091, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, డయల్-100 సేవల గురించి వివరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు, సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే షీటీమ్ వాట్సాప్ నంబర్ 8712656935 కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, మార్కెట్ కార్మికులు షీటీమ్ చేపడుతున్న సేవలను అభినందించారు.




# గార్లలో ఉచిత వైద్య శిబిరం

- 370 మంది గ్రామస్తులకు పరీక్షలు

**గార్ల, మే 7 (ప్రభాత గమనం) :**

స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రజల నుండి విశేష స్పందన పొందింది. సామాజిక బాధ్యతలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పీఏసీఎస్ (PACS) చైర్మన్ దుర్గాప్రసాద్, సర్పంచ్ బానోత్ పార్వతి హతిరామ్ రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ శిబిరంలో నిపుణులైన వైద్య బృందం రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ మరియు ఇతర సాధారణ తనిఖీలు నిర్వహించారు. స్వయంగా ఎంపీడీవో మంగమ్మ శిబిరాన్ని సందర్శించి, బీపీ పరీక్షలు చేయించుకున్నారు. అలాగే సోషల్ మీడియా యాక్టివిస్ట్ (ట్విట్టర్) కందునూరి ఈశ్వర్ లింగం రక్త పరీక్షలు చేయించుకుని ప్రజల్లో అవగాహన కల్పించారు. మొత్తం 370 మంది ఈ శిబిరం ద్వారా ఉచిత వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ పార్వతి హతిరామ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు ఉచితంగా సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానిక నేతలు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఖానాపూర్ ఎస్సైకి
# నగదు పురస్కారం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



మూగ జీవాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఖానాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై జి. రామ్మోహన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. గురువారం వరంగల్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై రామ్మోహన్‌కు నగదు రివార్డును అందజేసి ప్రశంసించారు. మూగ జీవాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఖానాపూర్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు కీలక సమాచారం సేకరించినందుకు పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ నేర నియంత్రణలో మెరుగైన ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తామని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ కూడా ఎస్సై రామ్మోహన్ సేవలను అభినందించారు. సమాజంలో అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో పోలీసుల పాత్ర కీలకమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.



## బాధితుల ఫిర్యాదులపై
# తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ సీపీ గురువారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ ఉదయం చిల్పూర్ పోలీస్ స్టేషన్ కు పోలీస్ అధికారులు పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సీపీ సిబ్బందిని పని తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు.చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహనా కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని,అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పోగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహారించాలని పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి తెలిపారు.ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీం శర్మ, సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐ నవీన్ కుమార్ వున్నారు.

### చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీపీ

వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సీపీకి తీర్థ ప్రసాదాలు స్వామి వారి శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను, ఆలయంలో జరిగే కార్యక్రమాల వివరాలను ఆలయ పూజారి పోలీస్ కమిషనర్ కు వివరించారు.



## వార్షిక శిక్షణలో భాగంగా
# ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహణ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ జిల్లా అమ్మవారిపేట ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన వార్షిక మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీసు సీనియర్ అధికారులు మరియు ఎస్‌హెచ్‌ఓలు ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, హాజరై అధికారుల ఫైరింగ్‌ను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఆయుధాల పనితీరును పరిశీలిస్తూ, ఎస్పీ కూడా వివిధ రకాల ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మా ట్లాడుతూ, ఆయుధాల వినియోగంలో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా అత్యవసర పరిస్థి తుల్లో వేగంగా, సమర్థవంతంగా స్పందించే సా మర్థ్యం పోలీసు సిబ్బందిలో పెంపొందుతుందని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి ఆయుధాల వినియోగంపై పూర్తి ప్రావీణ్యం సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే, సీనియర్ అధికారులు మరియు ఎస్‌హెచ్‌ఓలు తమ సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్‌పై పూర్తి అవగాహన కల్పించాలని, ఫైరింగ్ గ్రౌండ్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలను స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, అందుకు అవసరమైన శిక్షణను నిరంతరం అభ్యసించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తుపాకులతో విధులు నిర్వహించే అధికారులు తగు జాగ్ర త్తలు పాటించాలని, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు పోలీసుల ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి శాంతిభద్రతల పరిరక్షణకు దో హదపడతాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతి అధికారి అప్రమత్తత, క్రమశిక్షణ, సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ స్నేహ శబరిష్
- రెండు పడకల గదుల నిర్మాణ పనుల పరిశీలన
- ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ



మహబూబాబాద్ మే7(ప్రభాత గమనం):

గురువారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లాలోని తొర్రూరు మండలం చీకటాయపాలెం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న (280) రెండు పడకల గదుల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం లేదా ప్రజల సొంత ఇంటి కల నిర్మాణం సహకారం చేయడానికి రెండు పడకల గదుల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని అన్నారు. తొర్రూరు పట్టణం చీకటాయపాలెం లో నిర్మాణంలో వేగం పెంచి పెండింగ్ పనులు త్రాగునీరు పైపు లైన్, విద్యుత్, డ్రైనేజీ సిస్టం, తదితర అంతర్గత పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. హౌసింగ్, ఇంజనీరింగ్, విద్యుత్, త్రాగునీరు సరఫరా, డ్రైనేజీ సిస్టం, తదితర పనుల విభాగం వారు పలుల స్థితిగతుల పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, దశలవారీగా ఉన్న పనుల యొక్క వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు వెంటనే పడేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన స్వయం సహాయక బృంద సభ్యులకు గృహ నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందజేయాలని తెలిపారు. అనంతరం మండలంలోని వెలికట్టె గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాల నమోదు, లారీల ద్వారా తరలించిన వివరాలు, సంబంధిత సిబ్బందినీ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని వెంట వెంటనే సేకరించాలని సేకరించిన ధాన్యంను మిల్లులకు తరలించాలని, రవాణా సజావుగా జరిగే విధంగా వాహనాలను సిద్ధంగా ఉంచాలని, వాతావరణ పరిస్థితుల మార్పులపై రైతులకు అవగాహన కల్పిస్తూ, టార్పాలిన్లు, సిద్ధంగా ఉంచుకోవాలని, త్రాగునీరు, టెంట్,చైర్స్, ఫస్ట్ ఎయిడ్ వైద్య బృందం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం, సంబంధిత అధికారులు, ఎంపీడీవో, తహసిల్దార్, తదితరులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం

మహబూబాబాద్ మే7(ప్రభాత గమనం):



గ్రామాల అభివృద్ధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అని, ప్రతిరోజు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, శానిటేషన్, త్రాగునీరు సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల అమలు, పెన్షన్ పరిశీలన ఆమోదం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి, ఓవర్ వాటర్ హెడ్ ట్యాంకర్, పరిశుభ్రత, మిషన్ భగీరథ నీరు సరఫరా, తదితర ప్రతి విభాగానికి సంబంధించిన పనులలో గ్రామపంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యులను చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరును అందిస్తూ ఇతర నీటి వనరులను ఏర్పరుచుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ఉన్న ప్రతి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేపిస్తూ ఉండాలని, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రామస్థాయిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, లేబర్ టర్నోవర్ పెంచాలని తెలిపారు. అంతర్గత రోడ్ల, అభివృద్ధి పనులు పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, తదితర సదుపాయాలను ప్రజలకు అందిస్తూ పచ్చదనం పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో, (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



## మద్దతు ధరతోనే
# రైతుకు ఆర్థిక భరోసా

- కేసముద్రం సింగిల్ విండో చైర్మన్ దికొండ వెంకన్న
- విలేజ్ కేసముద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేసముద్రం మే7(ప్రభాత గమనం):

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని కేసముద్రం సింగిల్ విండో చైర్మన్ దికొండ వెంకన్న అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రం సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ దికొండ వెంకన్న, తహశీల్దార్ వివేక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ..గ్రామాల్లోనే కేంద్రాలు ఉండటం వల్ల రైతులకు రవాణాభారం తగ్గుతుందన్నారు. అధికారులు ఎక్కడా అవకతవకలకు తావులే కుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరిపి,సకాలంలో చెల్లింపులు అయ్యేలా చూడాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యాన్ని ఎండబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయానికి తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రావుల వినయ్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్స్ బీరం గోపాల్ రెడ్డి, తోట శోభా నాగన్న, గూగులోత్ రాంజీ నాయక్, మహేందర్ రెడ్డి, నంద, నూనావత్ శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కీర్తి సురేందర్, సీఈవో ఎల్లయ్య, సిబ్బంది రమేశ్, రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



# మే 8న మెగా జాబ్ మేళా

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి కొండా సురేఖ

హన్మకొండ, ప్రభాతగమనం :

హనుమకొండలో మే 8వ తేదీన శుక్రవారం నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ కోరారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మంత్రి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చదువుకు తగిన ఉద్యోగ అవకాశాలు యువతకు అందేలా ఇలాంటి మెగా జాబ్ మేళాలు దోహదపడతాయని పేర్కొన్నారు. హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మీడియా, హెల్త్ కేర్, బిజినెస్ సర్వీసెస్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, కస్టమర్ కేర్, హాస్పిటాలిటీ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలతో నేరుగా మెగా జాబ్ మేళాకు హాజరుకావాలని మంత్రి కోరారు.



## రైతు చెమటకు గౌరవం..
# కళలకు ప్రోత్సాహం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- మెగా రైతు మేళాను సందర్శించిన వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు

హనుమకొండ, మే 7 (ప్రభాత గమనం):

హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా సందడిగా కొనసాగుతోంది. గురువారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, మహిళా సంఘాలు, గ్రామీణ కళాకారులు స్వయంగా తయారు చేసిన వస్త్రాలు, దుప్పట్లు, హస్తకళా వస్తువులు, గృహోపకరణాలను పరిశీలించి కొనుగోలు చేశారు. రైతుల కష్టం, గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసం, స్వయం ఉపాధి పట్ల వారి అంకితభావాన్ని అభినందించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా రైతు కుటుంబాలకు ఆర్థికంగా బలం చేకూరుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రైతు కేవలం అన్నదాత మాత్రమే కాదు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని కొనియాడారు. మెగా రైతు మేళా రైతులకు కొత్త అవకాశాలు, మహిళా సంఘాలకు మార్కెట్ వేదిక, గ్రామీణ ప్రతిభకు గుర్తింపుగా నిలుస్తోందని తెలిపారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రెండేళ్లలోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ
- ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన లాభాలు
- మెగా రైతు మేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లండి :మంత్రి కొండా సురేఖ
- హన్మకొండలో మూడు రోజుల రాష్ట్రస్థాయి రైతు ఉత్సవాల ముగింపు
- 5వేల మంది రైతులకు ఆధునిక యంత్ర పరికరాలు, సాగు పద్ధతులపై శిక్షణ
- ఆదర్శ రైతులకు సన్మానం, ఆయిల్ పామ్ రైతులకు చెక్కుల పంపిణీ



హన్మకొండ, మే 7 (ప్రభాత గమనం):

తెలంగాణ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం సరికొత్త దిశానిర్దేశం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా మూడు రోజుల పాటు జరిగిన 'రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా' గురువారంతో ముగిసింది. ముగింపు వేడుకలకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరై, వివిధ స్టాళ్లను సందర్శించి ఆదర్శ రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

## రుణమాఫీలో దేశానికే ఆదర్శం

రెండున్నర ఏళ్లలోనే 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని మంత్రి వెల్లడించారు. వాతావరణ ప్రభావం లేని, అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ పంటను రైతులు విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పరికరాలు, విత్తనాలు, మార్కెటింగ్ మెలకువలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రసాయన ఎరువులు తగ్గించి, సహజ, సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని మంత్రులు సూచించారు. పంట మార్పిడీ, అంతర పంటల సాగు ద్వారా రైతులు అప్పుల భార నుంచి బయటపడాలని ఆకాంక్షించారు.

## రైతులకు అండగా ప్రభుత్వం

మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. దేశంలోనే మొక్క జొన్న కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రైతు బంధు నిధుల విడుదల, సకాలంలో యూరియా సరఫరా వంటి చర్యల ద్వారా రైతు సంక్షేమంపై తమ చిత్తశుద్ధిని చాటుకుంటున్నామని చెప్పారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న కల్తీల నేపథ్యంలో ఆహార భద్రత కోసం సేంద్రియ వ్యవసాయం అత్యవసరమన్నారు. మహిళా రైతులు లావణ్య రెడ్డి, భావన రెడ్డి వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

## మేళాకు విశేష స్పందన

ఈ మెగా రైతు మేళాలో వ్యవసాయ యంత్ర పరికరాలు, శాస్త్రవేత్తల సలహాలు రైతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిరోజూ సుమారు 5,000 మంది రైతులు హాజరై ఆధునిక సాగు పద్ధతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులకు మంత్రులు చెక్కులను పంపిణీ చేసి, వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్య శారద మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఈనెల 20లోగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పూర్తి చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాలకు తావులేదు
- అర్హులైన పేదలకే అవకాశం
- బిల్లులను సకాలంలో విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశం
- లక్ష దాటిన జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్ల నియామకం
- రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూవివాదాలపై ఉమ్మడి సర్వేకు నిర్ణయం
- గతంలో సేకరించిన భూముల్లో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మే 7 (ప్రభాత గమనం):



రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలకు తీపి కబురు అందిస్తూ, గృహ నిర్మాణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈనెల 20వ తేదీలోగా డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ప్రజా భవన్‌లో ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## అర్హులకే ప్రాధాన్యత

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఎక్కడా అక్రమాలు జరగకుండా పారదర్శకత పాటించాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఎంపిక విషయంలో కలెక్టర్లకే పూర్తి బాధ్యతలు, అధికారాలు ఇచ్చామని, ఎక్కడ పొరపాట్లు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. గతంలో ఇళ్ల కోసం సేకరించి వినియోగించని భూముల్లో అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. "ప్రతి పేదవాడికి సొంత గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం" అని ఆయన పునరుద్ఘాటించారు.

## రెవెన్యూ వ్యవస్థలో భారీ మార్పులు

పాలనా సౌలభ్యం కోసం రెవెన్యూ శాఖలో కీలక సంస్కరణలు తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్లను నియమించనున్నట్లు, దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను కోరారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు ఉమ్మడి సర్వే (Joint Survey) నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

## బిల్లుల చెల్లింపుపై కీలక ఆదేశం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వారి బిల్లులను సకాలంలో విడుదలయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్లకు సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రక్రియలో చొరవ చూపి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులకు సహకరించాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి మేరకు నల్గొండ జిల్లా కేంద్రంలో కొత్త రిజిస్ట్రేషన్ కార్యాలయం, నల్గొండ అర్బన్ మరియు రూరల్ ఎమ్మార్వో కార్యాలయాల ఏర్పాటుకు పొంగులేటి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో రాజకీయ రణరంగం

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బీజేపీ శ్రేణుల దాడికి యత్నం
- గంగుల క్యాంపు కార్యాలయంలో ఫర్నీచర్, కారు ధ్వంసం
- బండి సంజయ్ పై కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో భగ్గుమన్న కమల దళం
- రంగంలోకి పోలీసులు.. ఇరువర్గాలను చెదరగొట్టి కౌశిక్ రెడ్డిని అదుపులోకి

కరీంనగర్, మే 7 (ప్రభాత గమనం):

కరీంనగర్ వేదికగా బీఆర్ఎస్, బీజేపీ వర్గాల మధ్య చెలరేగిన రాజకీయ పోరు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు జిల్లాలో చిచ్చు రేపాయి. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న కౌశిక్ రెడ్డిపై బీజేపీ కార్యకర్తలు ఒక్కసారిగా దాడికి యత్నించారు.

## సవాల్ ప్రతిసవాల్‌తో ఉద్రిక్తత

ప్రెస్‌మీట్‌లో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, బండి సంజయ్ మధ్య 'మ్యాచ్ ఫిక్సింగ్' జరిగిందని ఆరోపించారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నారని విమర్శిస్తున్న బండి సంజయ్.. తంబాకులో డ్రగ్స్ కలుపుకుని తింటారని అందుకే ఆయనకు వెంట్రుకలు పోయాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా, గీత భవన్ చౌరస్తాలో చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలతో ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో క్యాంపు కార్యాలయానికి చేరుకుని నినాదాలు చేస్తూ లోపలికి చొచ్చుకెళ్లారు.

## రణరంగంగా మారిన క్యాంపు ఆఫీస్

బీజేపీ కార్యకర్తలు కార్యాలయంలోని కుర్చీలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడమే కాకుండా, బయట ఉన్న ఎమ్మెల్యే కారు అద్దాలను పగలగొట్టారు. బీఆర్ఎస్ శ్రేణులు కూడా ప్రతిదాడికి సిద్ధమవ్వడంతో పరిస్థితి అదుపు తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు భారీగా చేరుకుని లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం కౌశిక్ రెడ్డిని పోలీస్ వాహనంలో హుజూరాబాద్‌కు తరలించారు.

## ప్రజాస్వామ్యానికి అపహాస్యం: కేటీఆర్



*తన అనుచరులతో దాడి చేయించి శాంతిభద్రతలను దెబ్బతీయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని కేటీఆర్ విమర్శించారు. అరాచకం జరుగుతున్నా, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మండిపడ్డారు. ప్రస్తుతం కరీంనగర్, హుజూరాబాద్‌లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.*

# యూట్యూబ్ చూసి వ్యక్తి హత్య

- సహజీవన భాగస్వామిని చంపిన తల్లీకొడుకు
- పథకం ప్రకారం నిద్రలో ఉండగా మెడపై వేటు
- ప్లాస్టిక్ డ్రమ్ములో మృతదేహం..
- తరలించే క్రమంలో పోలీసులకు చిక్కిన నిందితులు
- వివరాలు వెల్లడించిన కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ

హైదరాబాద్, మే 7 (ప్రభాత గమనం):

తమను వేధిస్తున్నాడన్న కోపంతో ఓ మహిళ తన కుమారుడితో కలిసి సహజీవనం చేస్తున్న వ్యక్తిని అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతంలో వెలుగుచూసింది. ఈ హత్య కోసం వారు సోషల్ మీడియాలో (యూట్యూబ్) 'వ్యక్తిని ఎలా చంపాలి?' అని వెతికి మరీ ప్లాన్ చేయడం గమనార్హం.

## హత్యోదంతం వివరాలివీ..

సంగారెడ్డి జిల్లాకు చెందిన అరుణ, తన భర్త చనిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివారెడ్డితో గత పదేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఆమెకు 19 ఏళ్ల సాయిరత్నం అనే కుమారుడు ఉన్నాడు. వీరు ముగ్గురూ కలిసి చింతల్‌లో నివసిస్తున్నారు. అయితే శివారెడ్డి తరచూ మద్యం తాగి వారిని వేధించేవాడు. ఆదివారం సాయిరత్నంపై శివారెడ్డి దాడి చేయడంతో, ఈ వేధింపులకు చరమగీతం పాడాలని తల్లి, కుమారుడు నిర్ణయించుకున్నారు.

## మృతదేహం తరలింపులో విఫలం

ఈ నెల 3న శివారెడ్డి నిద్రపోతుండగా, సాయిరత్నం కొత్తగా కొనుగోలు చేసిన కత్తితో అతని మెడపై నరికి చంపేశాడు. అనంతరం రక్తపు మరకలు ఉన్న దుస్తులను నాలాలో పడేశాడు. మృతదేహాన్ని ప్లాస్టిక్ డ్రమ్ములో కుక్కి మాయం చేయాలని చూశాడు. దీనికోసం తన స్నేహితుడిని పిలవగా, డ్రమ్ములో మృతదేహాన్ని చూసిన అతను భయాందోళనతో నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణం

- మహిళా సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం
- వడ్డీ భారం మొత్తం ప్రభుత్వానిదే
- ఈ ఏడాది రుణాల వడ్డీ కోసం రూ. 2,500 కోట్ల కేటాయింపు
- పేదరికం పోవాలనే నాటి పోరాటం.. నేడు వడ్డీలేని రుణాలు
- నిర్మల్ జిల్లా మాదిరిగా 100% రీపేమెంట్ సాధించాలి
- మంత్రి సీతక్క స్పష్టీకరణ



హైదరాబాద్, ప్రభాత గమనం:

తెలంగాణలోని స్వయం సహాయక సంఘాల (SHG) మహిళలకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీపి కబురు అందించారు. ఇప్పటివరకు ఉన్న రూ. 5 లక్షల వడ్డీలేని రుణ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఆమె ప్రకటించారు. పెంచిన రుణాలపై అయ్యే వడ్డీ మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఆమె స్పష్టం చేశారు. గురువారం ప్రజా భవన్‌లో జరిగిన 'బ్యాంకు వార్షిక రుణ ప్రణాళిక' ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## వడ్డీ చెల్లింపుల కోసం రూ. 2,500 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల రుణాల వడ్డీల కోసం ప్రభుత్వం రూ. 2,500 కోట్లను కేటాయించిందని మంత్రి వెల్లడించారు. 2025–26 ఆర్థిక ఏడాదిలో మహిళా సంఘాలకు సుమారు రూ. 25,228.89 కోట్ల రుణాలను బ్యాంకులు అందించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది ఈ మొత్తాన్ని రూ. 26 వేల కోట్లకు పెంచడమే లక్ష్యమని తెలిపారు.

## భావోద్వేగానికి గురైన మంత్రి

ఈ సందర్భంగా మంత్రి సీతక్క తన గతాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. "వడ్డీ వ్యాపారుల దోపిడీని చూడలేక, పేదరికం వల్లే గతంలో తాను తుపాకీ పట్టి మావోయిస్టుగా మారాల్సి వచ్చింది" అని తెలిపారు. ఆ అనుభవంతోనే పేద మహిళలు వడ్డీల ఊబిలో చిక్కుకోకూడదనే ఉద్దేశంతో, వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే ప్రభుత్వ సంకల్పం. రుణాలు తిరిగి చెల్లించడంలో మహిళలు క్రమశిక్షణతో వ్యవహరిస్తున్నారని, నిర్మల్ జిల్లా 'జీరో ఎన్‌పిఏ' (Zero NPA) సాధించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. బ్యాంకులకు ప్రభుత్వం పూర్తి గ్యారెంటీ ఇస్తుందని, రీపేమెంట్ బాధ్యత తమదేనని బ్యాంకులకు హామీ ఇచ్చారు. ఐకేపీ (IKP) కేంద్రాల ద్వారా పంట కొనుగోలు బాధ్యతల్లో 40 శాతం మహిళా సంఘాలకే అప్పగించినట్లు వెల్లడించారు. 'మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి' అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మరియు బ్యాంకర్లు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374